26 AUG 2019

# నేటినుంచి పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సభను సమర్థంగా నిర్వహించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి వి.నారాయణసామి ఆదివారం మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షాలైన ఎన్నార్ కాంగ్రెస్, అన్నాడీఎంకే, భాజపాలు సభాపతి వీపీ శివకొళుందుపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సమాయత్తమవుతున్న నేపథ్యంలో దీనిని ధీటుగా ఎదుర్కోడానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం మంత్రులతో, కాంగ్రెస్, డీఎంకే ఎమ్మెల్యేలతో చర్చించారు. సమావేశంలో ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. అవిశ్వాస తీర్మానంతో స్పీకరును ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తున్న ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి ఆదివారం రాత్రి 8.30 తర్వాత రాజ్‌నివాస్‌కు వెళ్లి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. రంగసామితో పాటు భాజపా అధ్యక్షుడు వి.సామినాథన్ వెళ్లారు.

## అందరిలో ఉత్కంఠ..

బడ్జెట్ సమావేశాలు సోమవారం లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. కేంద్ర హోంశాఖ సమర్పించిన బడ్జెట్‌ను ఆమోదించినట్లు ముఖ్యమంత్రి వి.నారాయణసామి ఒక సమావేశంలో ప్రకటించారు. దీంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకరు వీపీ శివకొళుందుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ప్రతిపక్షాలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. భాజపా ఎమ్మెల్యేలు ఆర్.సామినాథన్, సెల్వగణపతి తాము అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నట్లు శాసనసభ కార్యదర్శి విన్సెంట్ రాయర్‌కు లేఖ అందజేశారు. ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి అవిశ్వాస తీర్మానానికి అన్నాడీఎంకే పార్టీ మద్దతు కోరుతూ తమిళనాడు ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వంను చెన్నై వెళ్లి కలిశారు.

# గణపతి ఉత్సవాలకు రాటముహూర్తం

యానాం, న్యూస్‌టుడే: స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద ఏటా జరిపే విజయగణపతి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం రాటముహూర్తం చేశారు. నవరాత్రులను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధి చింతా అప్పారావు తెలిపారు. పూజలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాజుల బ్రహ్మానందం(బాబీ), గుత్తుల వెంకటేశ్వరరావు, దంగేటి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మధు, కరకా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సెప్టెంబరు 2న ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు దంపతుల చేతుల మీదుగా కలశ స్థాపన పూజలు నిర్వహిస్తామని తెలిపారు.



రాటముహూర్తం పూజ చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

## పలువురి సంతాపం..

యానాం: కేంద్ర మాజీమంత్రి అరుణ్‌జైట్లీ మృతితో భాజపా గొప్ప నాయకుడిని కోల్పోయిందని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశం గొప్ప న్యాయకోవిదుడిని కోల్పోయిందన్నారు. జైట్లీ మృతితో మానవత్వం కలిగిన ఒక మంచి రాజకీయ నేతను భాజపా కోల్పోయిందని ముఖ్యమంత్రి వి.నారాయణసామి పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు నమశ్శివాయం, సామినాథన్ తమ సంతాపాన్ని తెలిపారు.



ఫరంపేటలో వరిచేనును ఫొటో తీస్తున్న పరిపాలనాధికారి శివరాజ్ మీనా

# వరద నష్టాలపై అంచనా

యానాం: గోదావరి వరదల కారణంగా యానాంలోని పల్లపుప్రాంతాలు, లంకభూములు ముంపునకు గురయ్యాయి. అధికారులు ఆయా ప్రాంతాల్లో నష్టాలను అంచనా వేస్తున్నారు. పుదుచ్చేరి కలెక్టర్ అరుణ్ నష్టాల నివేదికల్ని గణాంకాల వివరాలతో, చిత్రాలతో సహా ఇవ్వాలని ఆదేశించారు. పరిపాలనాధికారి శివరాజ్‌మీనా ఆదివారం ముంపు పొలాలు పరిశీలించి ఫొటోలు తీశారు. నష్టపోయిన రైతులు, ముంపునకు గురైన ఇళ్లలోని బాధితుల నుంచి రెవెన్యూ, వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖ అధికారులు వివరాలు సేకరించి పరిపాలనాధికారి కార్యాలయంలో అందజేస్తున్నారు. తాజా అంచనాలు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం పరిహారం అందిచనుంది.

26 AUG 2019.

# నేడు పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

యానాం, ఆగస్టు 25: కేంద్రపాలిత ప్రాంతమైనా పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం 26వతేదీ సోమవారం నిర్వహిస్తామని అసెంబ్లీ కార్యదర్శి ఎ.విన్‌సెంట్ రాయార్ తెలిపారు. సోమవారం ఉదయం 9.30కు స్పీకర్ అధ్యక్షతన ఈసమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలకు సమాచారం అందించారు. పుదుచ్చేరి ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్ రూ. 8425కోట్లకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలపడంతో ఈ సమావేశం నిర్వహించడం ముఖ్య ఉద్దేశం. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐదు నెలలకుగాను మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగియనుంది. మిగిలిన ఏడు నెలల కాలానికి సంబంధించి బడ్జెట్ కేంద్ర అనుమతికి పంపారు. దీంతో అనుమతి లభించడంతో సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

26 AUG 2019

# 2 నుంచి పిళ్లయ్యార్ స్వామి నవరాత్ర బ్రహ్మోత్సవాలు

## ఏర్పాట్లు చేస్తున్న దేవస్థాన కమిటీ

యానాం: యానాంలో వేంచేసియున్న శ్రీపిళ్ల య్యార్‌స్వామి(లక్ష్మీగణపతి) వారి నవరాత్ర బ్రహ్మోత్సవాలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు సంబంధించి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్ ఆదివారం తెలిపారు.

**కార్యక్రమాల వివరాలు ..**

2న వినాయకచవితిని పురస్కరించుకుని నాద స్వరం, అభిషేకాలు, సర్వదర్శనం టీటీడీ నియమిత వేద పండితులు బ్రహ్మశ్రీ తాతపూడి రామకృష్ణావధానులచే వినాయక కథ, రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. 3న కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హంసవాహనం, 4న శ్రీకాకతీయ కమ్మ సంఘంచే మయూర(నెమలి) వాహనోత్సవం, 5న కోల వెన్ను సత్యరుషి ఉత్సవదారులుగా మూషికా వాహనోత్సవం, 6న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘంచే నంది వాహనోత్సవం, 7న శ్రీ గురు దత్త బ్రాహ్మణ సేవాసమితి ఉత్సవదారులుగా శేషవాహనం, 8న శెట్టిబలిజ సేవాసంఘం ఉత్సవదారులుగా సింహవాహనం, గణపతి హోమం 9న శ్రీ వేంకటేశ్వర దేవస్థాన ఆలయకమిటీ ఆధ్వర్యంలో డోలోత్సవం, పుష్పకవాహనం, 10న యానాం వర్తకసంఘంచే రథోత్సవం, 11న సాయంత్రం అగ్నికుల క్షత్రియ సేవాసంఘం ఉత్సవదారులుగా సాయంత్రం 6.30 గంటలకు తెప్పోత్సవం జరుగుతుందన్నారు. అదేవిధంగా గణపతి హోమఫలంలో పాల్గొనే భక్తులు ముందుగా సంప్రదించాలని శ్రీవేంకటేశ్వర దేవస్థానకమీటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు శంకరరావు, ఆకుల నాగేశ్వరరావు, కాదా వెంకటేశ్వరరావు, గాంధీ తదితరులు తెలిపారు.



పిళ్లయ్యార్ స్వామి

# ఘనంగా పందిరి రాట ముహూర్తం



విజయగణపతివారి పందిరిరాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

యానాం: పట్టణపరిధిలోని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద నున్న డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ స్టేడియం కూడలిలో విజయగణపతి చతుర్థశ నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాటముహూర్త కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో విశేషపూజలును ఘనంగా నిర్వహించారు.

**2న కలశస్థాపన**

వచ్చే నెల 2వ తేదీన కలశస్థాపన కార్యక్రమం పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు దంపతులచే నిర్వహించనున్నట్లు విజయగణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాజుల శ్రీ బ్రహ్మానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తుల వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మధు, యర్రా జగన్నాధరావు, చింతా అప్పారావు, దంగేటి వెంకటేశ్వర్లు, భాస్కరరావు, వెంకటరమణ, రమేష్, రామకృష్ణ, సురేష్, సతీష్, అమృత్ బృందం పాల్గొన్నారు.

# సత్యవ్రతంలో ఫ్రెంచివారు

యానాం: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఎల్లలు దాటుతున్నాయి. ఒకప్పుడు ఫ్రెంచివారు తాము పాలించిన ప్రాంతాలతో ఏర్పాటు చేసుకున్న సంబంధాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ చెరిగిపోలేదు. వారితో భారతీయులు వైవాహిక జీవితాన్ని గడుపుతుండటం మరో విశేషం. భారతీయులు ఫ్రెంచివారిని వివాహం చేసుకుని వారితో చక్కగా జీవితాన్ని గడుపుతున్నారు. జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం 1800 సంవత్సరం నుంచి ఫ్రెంచివారి ఆధీనంలో ఉంది. ఆ సమయంలో అక్కడివారికి ఫ్రెంచి జాతీయ పౌరసత్వాన్ని చాలామందికి ఇచ్చారు. ప్రస్తుతం యానాంలో 60 కుటుంబాల వరకు ఫ్రెంచి జాతీయులు ఉన్నారు. కొందరు యానాంలోని ఇండో–ఫ్రెంచ్ జాతీయులు ఫ్రాన్స్‌లోని అబ్బాయిలను వివాహం చేసుకున్నారు. అలా వారంతా అప్పుడప్పుడు ఫ్రాన్స్ నుంచి తమ కుటుంబ సభ్యులతో యానాం వస్తుంటారు. ఆదివారం యానాంలోని ఫ్రెంచి జాతీయుడు కామిశెట్టి రాము కుటుంబంలో ఆదివారం స్థానిక విష్ణాలయం వీధిలోని ఆయన గృహంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఇందులో ఫ్రెంచి జాతీయులతో కూడిన కుటుంబాలు పాల్గొని పూజలు చేశారు.



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ఫ్రెంచి జాతీయుల కుటుంబాలు

వీరంతా తెలుగు సంస్కృతీ, సంప్రదాయ దుస్తులను ధరించి పాల్గొనడం విశేషం. శ్రీకృష్ణదేవరాయలుతో ఆంధ్ర మహావిష్ణువు 'తెలుగదేల యన్న దేశంబు తెలుగు...' అన్నాడు. అంతేకాదు బ్రౌన్‌లాంటి వారు తెలుగు సంస్కృతిని, సాహిత్యాన్ని చూసి పరవశించిపోయారు. అలా విదేశీయుల మనసులను కదిలించిన తెలుగు సంస్కృతి ఖండాంతరాలకు వ్యాప్తి చెందుతోంది అనడానికి ఇలాంటి ఘటనలు ఉదాహరణలుగా నిలుస్తాయి.

# నేడు పుదుచ్చేరి బడ్జెట్ సమావేశం

యానాం: పుదుచ్చేరి బడ్జెట్ సమావేశం సోమవారం జరుగనుంది. ఈ సందర్భంగా ప్రథమంగా ఎల్జీ కిరణ్‌బేడీ అసెంబ్లీలో సభ్యులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మార్చినెలలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జరపకుండా కేవలం ఐదు నెలలకు గాను మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే అప్పటినుంచి బడ్జెట్ ఆమోదం జరుగకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉండటంతో ఇటీవలి రాష్ట్ర ప్రణాళికాసంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతిపాదనలును ఆమోదించి దానిని కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపారు. అయితే అవి హోం, ఆర్థిక శాఖల అనుమతి పొందడంతో వాటిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందనున్నారు. ఇదిలావుండగా స్పీకర్ శివకొలిందుపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శి విన్సెంట్ రాయర్‌కు నోటీసు ఇవ్వడంతో దానిపై సైతం చర్చ జరుగుతుందని భావిస్తుండటంతో అందరిలోను ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్ఆర్‌కాంగ్రెస్ నేత మాజీ సీఎం రంగసామి ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు ఆదివారం ఎల్జీ కిరణ్‌బేడీని కలవాల్సి ఉన్నప్పటికీ సమావేశాన్ని వాయిదావేసుకున్నారు.